క్లుప్తంగా

అగస్త్యేశ్వరుడికి పూజలు



అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని పాత రాయచోటిలో వెలసిన దాక్షాయిని సమేత అగస్త్యేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం మొలకల పౌర్ణమి సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, పూజలు, మహా గణపతి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

వైభవంగా కాలభైరవుడి తిరునాల



భక్తులకు దర్శనమిస్తున్న కాలభైరవుడు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపాన గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి తిరునాల భక్తుల కనుల పండువగా సాగింది. గురువారం స్వామి వారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. తిరునాలకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రాత్రి చాంది బండ్లతో మెరవణి, ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోటలో కత్తిసాము



సిద్దవటం కోటలో కత్తిసాములో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

సిద్దవటం : మండల కేంద్రంలోని మట్లిరాజుల కోటలో జయచంద్ర అకాడమీ వారిచే గురువారం విద్యార్థుల్లో పురాతన కత్తి, కర్ర సాముల నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని అకాడమీ చైర్మన్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజులు పరిపాలించిన ఈ కోటలో అలనాటి పురాతన సాంస్కృతిక నైపుణ్యం ఎంతో అవసరమని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు పురాతన విద్యలైన కర్రసాము, కత్తి సాములను నేర్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను తీసుకొచ్చామన్నారు.

నివాళి



సుబ్బరాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొర్లముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : కొర్లకుంట దళితవాడ గ్రామానికి చెందిన పండుగొల్ల సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సుబ్బరాయుడు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి సలహా చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, రాష్ట్ర నాయకులు హేమనవర్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణ టీకాలు తప్పనిసరి



టీకాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలోని డా. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం ఎంపీసీపీ (జాయింట్ సెక్రటరీ) డాక్టర్ సునీల్ కుమార్ నాయక్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబుల ఆధ్వర్యంలో వయో వృద్ధులకు క్షయ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయోవృద్ధులు తప్పనిసరిగా క్షయ నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట వైద్యాధికారి డాక్టర్ శ్వేత, ఒంటిమిట్ట పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాషా, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణ వేడుక

- వైభవంగా లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మీల కల్యాణోత్సవం
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనం

సిద్దవటం : మండల శివారులోని జె.ఎం.జె కళాశాల ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం గురువారం భక్తుల కోలాహలం నడుమ వైభవోపేతంగా జరిగింది. దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, ఆయన సతీమణి భారతి, కుటుంబ సభ్యులు స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు సుదర్శన హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి, చెంచులక్ష్మీల సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తులను వేద పండితులు నైషధం ప్రతాప్ శర్మ, నైషధం నరేష్‌శర్మలు స్వామి వారికి సాంప్రదాయ పద్ధతిలో పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ వేడుకను నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేముల హరిప్రసాద్, వైస్ చైర్మన్ వేముల గిరిప్రసాద్, రిటైర్డ్ తహసీల్దారు గంగులయ్య, అసిస్టెంటు జనరల్ సెక్రెటరీ నరసింగాళ్ల సునీల్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాలెం చిన్న సుబ్బరాయుడు, భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిన దృశ్యం



పెనగలూరు మండలం ఈటమాపురంలో జరిగిన కల్యాణానికి హాజరైన భక్త జనసందోహం



సిద్దవటం: స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : తిరుపతికి చెందిన బాలాజీ స్వామి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 11 గంటలపైన శ్రీదేవి భూదేవి సమేత ఈటమాపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం 11 మంది వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద గుండాల్ రెడ్డి, శంకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈటమాపురం, నాయుడువారిపల్లి, తూర్పుపల్లె గ్రామస్తుల సహకారంతో ఈ కల్యాణ వేడుకను నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో చెంచులక్ష్మీకి పంచాయతీలోని చెంచులు (యానాదాలు) సాంగేము తెచ్చి కల్యాణం చేయించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణం నిర్వహిస్తుండటంతో మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రతి భక్తునికి తూర్పుపల్లి గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆలయం తరపున ట్రస్టు సభ్యులు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఈటమాపురం కొండపైకి రోడ్డు ఇరువైపులా ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొండపైన వివిధ రకాల దేవుళ్ల ప్రతిమలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో చూపరులను ఆకట్టుకుంది. కల్యాణానికి పోలీసులు బందోబస్తు కల్పించారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వీరబల్లె మండలంలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : మండల కేంద్రంలోని శ్రీ హరిహరాదుల ఆలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు, శివపార్వతులకు కల్యాణ తంతు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామి వారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. హరిహరాదుల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం పూర్తయ్యాక భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ వేడుకలలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో భారీ అన్నదానం

చిట్వేలి : పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారం స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకొని చిట్వేలిలో భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



వీరబల్లెలో కల్యాణ క్రతువును జరుపుతున్న పండితులు



అమ్మవారికి సాంగెము తీసుకువస్తున్న చెంచులు



చిట్వేలి: అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఈ మేరకు దశాబ్దాల కాలం చరిత్ర కల్గిన పురాతన నరసింహస్వామి పాదాల వద్ద కొణిదెల గంగాధర్ ఆధ్వర్యంలో 2 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని కరణం వెంకటసుబ్బయ్య పునరుద్ధరీకరణ పనులు చేపట్టారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే రాజుకుంట క్రాస్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద సర్పంచ్ గుత్తి నరసింహా, ఎంపీటీసీ నాగార్జునల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలం నుంచి వేల సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు పెంచలకోనకు తరలివెళ్లారు.

ఘనంగా గ్రామోత్సవం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో వెలసివున్న నరసింహస్వామికి గురువారం ఘనంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పండ్రా నరసింహులు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ పోటీలు

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న నందలూరు ప్రీమియర్ లీగ్–8 సీజన్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గాంధీనగర్ 11 (తోటపాలెం) వర్సెస్ నారాయణరాజుపేట జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ లెవన్ 119 పరుగులు చేసింది. తరువాత నారాయణరాజుపేట జట్టు 85 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన గాంధీనగర్ జట్టు ఆటగాడు వెంకటేష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రాజంపేట, పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్, సుబ్బనరసారెడ్డిల చేతులమీదుగా అందజేశారు. మధ్యాహ్నం మంటపంపల్లి కింగ్స్ డాబా 11 జట్టు, నందలూరు ఏఈ 11 జట్ల మధ్య పోటీ ఆసక్తికరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన మంటపంపల్లె జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 196 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నందలూరు జట్టు 13.2 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌట్ అయ్యి పరాజయం చెందింది. మంటపంపల్లె జట్టులోని వినయ్ 52 పరుగులు చేయడంతోపాటు 3 ఓవర్లు బౌలింగ్ చేసి ఏడు వికెట్లను పడకొట్టి అసిస్టెంట్ క్రికెట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్ లోడీ చేతులమీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడి సుధాకర్, శివకోటి, రంజిత్, చందు తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకుంటున్న వెంకటేష్, పక్కన గాంధీనగర్ లెవన్ జట్టు సభ్యులు

భక్తులతో పోటెత్తిన నల్లగంగమ్మ ఆలయం

- ఘనంగా ప్రారంభమైన దేవరరాయి నల్లగంగమ్మ జాతర
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారి దర్శనార్థం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మొలకల పౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేసి పచ్చని తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రతి యేడు మొలుకల పౌర్ణమి రోజున అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే గురువారం ఉదయం నుంచి అమ్మవారికి హోమాలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు గావించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. మొక్కులు తీరిన భక్తులు చాందినీ బండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో అన్నదానంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. తిరునాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా స్థానిక ఎస్ఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ



అమ్మవారిని దర్శించుకొంటున్న భక్తులు



హోమం చేస్తున్న వేదపండితులు

ఘనంగా వైఎస్ రాజారెడ్డి వర్ధంతి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి 26వ వర్ధంతి గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజారెడ్డి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ వైఎస్ కుటుంబానికి మూడు తరాలుగా రైల్వేకోడూరుతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. మొట్టమొదట వైఎస్ రాజారెడ్డితో ఉన్న అనుబంధాన్ని ప్రతి ఒక్కరూ కొనసాగిస్తూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారన్నారు. నేటికీ ఆయన్ను నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకున్నారంటే ఆయన చూపించే ఆప్యాయత, అండదండలు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, హేమనవర్మ, ముజీబ్, అన్వర్ బాషా, మండల నాగేంద్ర, శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, గునిశెట్టి రమేష్, సీహెచ్ రమేష్, లత, రాజేశ్వరమ్మ, కొరెడ్డి సిద్దయ్య, వైఎస్ కరిముల్లా, మస్తాన్, బాషా తదితరులు పాల్గొన్నారు.



రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

మ్యాజిక్‌తో మూఢ నమ్మకాలపై అవగాహన

కడప కల్చరల్ : మ్యాజిక్ ద్వారా మూఢ నమ్మకాలను గుర్తించగలిగే అవగాహన లభిస్తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి, మెజీషియన్ సమీర్ బాష తెలిపారు. గురువారం కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బాబాలు, మంత్రగాళ్ల పేరిట ప్రజల్లోని మూఢ నమ్మకాలను బలహీనతలుగా మార్చి సొమ్ము చేసుకునే మోసగాళ్లు పెరిగిపోతున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఇలాంటి పరిణామాలు సమాజానికి ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా పిల్లల చేత కొన్ని మ్యాజిక్ అంశాలు చేయించారు. చిన్నారులు వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు.

నేటి నుంచి ఉరుసు

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలో గల చారిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అలైహి వారి చాంద్ ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి గంధోత్సవంలో భాగంగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుండి గంధం దర్గా వద్దకు చేరి గురువుల మజార్ వద్ద సమర్పిస్తామన్నారు. 25వ తేదీన ఉరుసు, 26వ తేదీన తహలీల్ ఫాతెహా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఉరుసు, తహలీల్ రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి కచేరీ జరుగుతుందన్నారు.

మార్గదర్శకుడు అన్నమాచార్యులు

రాయచోటి టౌన్ : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 616 జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గురువారం రాయచోటిలోని కలెక్టరేట్ కార్యాలయం సమీపాన గుండాంజనేయ స్వామి ఆలయ సముదాయంలో అన్నమాచార్యుడి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ మంత్రం రాజపీఠం ఢిల్లీ స్వామీజీ సింహాయాజీ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం సంగీత కళారత్న యరగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నమాచార్యుల కృతులను ఆలపించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ 32 వేల సంకీర్తనలతో భగవంతుడి గుణగణాలను కీర్తించి శాశ్వతమైన బ్రహ్మపథాన్ని చేరుటకు ఈ సమాజానికి గొప్ప మార్గదర్శకుడు అయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో కీబోర్డు మాస్టర్ రామాంజనేయులు, నటరాజన్, మల్లికార్జున, హరినాథ, బసిరెడ్డి, విజయ్, జనార్దన్, అన్నదాత కోడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అన్నమాచార్యులు విగ్రహం వద్ద నివాళులర్పించిన భక్తులు

రైతులకు నాణ్యమైన విత్తనాలివ్వాలి

రామాపురం : ఖరీఫ్ సీజన్ రైతులకు కన్నీటి తుడుపునని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ఇందులో కోడూరు, రాజంపేట హార్టికల్చర్‌కు సంబంధించినవి, మిగతా నాలుగు నియోజకవర్గాలు వేరుశనగ ప్రధాన పంటగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తారన్నారు. ఇప్పటికే సబ్సిడీ విత్తనాలు ఆర్బీకేలకు చేరాయని, అధికారుల ఏ లెక్కల ప్రకారం గ్రామానికి 100 క్వింటాళ్ల విత్తన కాయలు కేటాయించారో తెలపాలన్నారు. విత్తన కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, గ్రామానికి ఎంత మేర విత్తనకాయలు అవసరమవుతాయో ఒక అంచనా వేయకుండ ఉండటాన్ని తప్పుబట్టారు. ప్రతి రైతుకు అవసరమైనన్ని విత్తన కాయలను సబ్సిడీ కింద అధికారులు అందజేయాలని డిమాండ్ చేశారు. రైతులు నష్టపోకుండా నాణ్యత గల విత్తనాలను అందించాలని కోరారు. విత్తన పంపిణీతో పాటు గ్రామాన్ని యూనిట్‌గా పరిగణించి నీటిని రైతులకు సమయానికి విడుదల చేయాలని తెలిపారు. ఎరువులు, పురుగుల మందులను సకాలంలో రైతులకు అందిస్తూ వారిని ఆదుకోవాలని వ్యవసాయ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతులు పట్టాభిరెడ్డి, చంద్రారెడ్డి, శీను, చంద్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి

చిటికె వ్యాధి నివారణకు టీకాలు వేయించండి

రామాపురం : గొర్రెలకు, మేకలకు చిటికె వ్యాధి సోకుండా నివారించడం కోసం టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై అన్నారు. గురువారం మండలంలోని గోపగుడిపల్లి, నీలకంఠ్రావుపేట, బి.రాచపల్లె గ్రామాలలో జరుగుతున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మాట్లాడుతూ మండలంలో 53 వేలు గొర్రెలు, మేకలు ఉన్నాయని, మొదటి విడతలో 20వేలు గొర్రెలకు మాత్రమే మందు వచ్చిందని, గతంలో చిటికె వ్యాధి వ్యాపించిన గ్రామాలలో ఈ టీకాను వేస్తున్నామన్నారు. తదుపరి రెండవ విడతలో మిగతా గ్రామాలలో టీకాలను వేయడం జరుగుతుందని తెలిపారు. గొర్రెల పెంపకందారులు తప్పకుండా తమ జీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, సహాయకులు రేవతి, రాజకుమారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

మహాభారత యజ్ఞానికి సన్నాహాలు

రామాపురం : మండల కేంద్రంలో 18 రోజులపాటు మహాభారత యజ్ఞం నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. జూన్ 9వ తేదీ నుంచి మండల కేంద్రంలో మహాభారత యజ్ఞాన్ని ప్రారంభం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక హరిహరాలయంలో మహాభారత యజ్ఞం కమిటీ సమావేశమై కార్యక్రమానికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ మహాభారత యజ్ఞంలో ఉదయం మహాభారతాన్ని హరికథ రూపంలో, రాత్రి సమయంలో వేషాధారణ రూపంలో చెప్పనున్నారు. ప్రతి ఏటా మహాభారత యజ్ఞంకు మంచి స్పందన లభిస్తోందని, 18 రోజలపాటు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు సత్యయాదవ్, ప్రసాద్‌రెడ్డి, ఆదెన్న, రాజగోపాల్‌రెడ్డి, దామోదరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు

రామాపురం : ఎన్నికల నిబంధనలను అతిక్రమించి గ్రామాలలో అలజడలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ పి.రామచంద్రరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అందరి సహకారంతో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని, అలాగే జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజు కూడా అందరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా గ్రామాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో ఘర్షణలకు పాల్పడితే తమ పని తాము చేయాల్సి వస్తుందన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, సంబరాలు, టపాసులు కాల్చడం వంటివి చేయకూడదని, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని, ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టుకోవాలన్నారు. ప్రజలు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉండకూడదని, ఇంటి వద్దనే ప్రశాంతంగా టీవీలలో చూసుకోవాలని, ఎన్నికల ఫలితాలు రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురికి మంచి ఒక చోట ఉండకూడదని ఆయన తెలియజేశారు. సమావేశంలో లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ బాబు, మండల ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్ శర్మ, ఎస్పీ కానిస్టేబుల్ రమేష్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వివిధ పార్టీల నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ పి.రామచంద్రరావు